# గువ్వ కోరుకున్న గూడు

వడ్లపట్ల దయానందం

కథానిక

నిలువెత్తునున్న మూడి కిటికీలోని అద్దంలో ముఖం చూసుకుంటూ పాపిట తీసుకుంటున్న సీతారత్నంతో గోడమీదున్న సున్నాన్ని గోళ్ళతో గీరుతూ—

"ఏమే సీతారత్నం-మీ ఆయన వెంటవచ్చిన కొత్త కుర్రాడెవరే"-అంది గువ్వ, గుసగుస లాడుతున్నట్టుగా. అద్దంలోంచి ముఖాన్ని, గువ్వవైపు మళ్ళించి ఫక్కున నవ్వేసింది సీతారత్నం. గువ్వ తెగ సిగ్గుపడిపోయి ముఖం క్రిందికి దించేసుకుంది. అక్కడికే ప్రొద్దుటనుంచీ ఈ మాటడగాలని కుతూహలం ఉన్నా, ఇదిగో ఈ వెధవ సిగ్గడ్డొచ్చి సాయంకాలానికి కాని ధైర్యంచేయలేకపోయింది. అదయినా చిన్ననాటినుండి స్నేహితురాలు, పక్కింటి పిల్లా గనుక. సీతారత్నాన్నడగ్గలిగింది కాని అదే మరొహర్నయితే అస లడగ్గలిగేదా?

ఆసలే గువ్వకి చచ్చేటంత సిగ్గు. పరాయి మొగపురుక్కి ఎటువంటి పరిస్థితులలోనూ ముఖం చూపించలేదు...అంటే అలా చూపించటానికి ఇష్టముండదని కాదు, సిగ్గువల్లే. ఎప్పుడైనా, ఎక్కడ ఎవరైనా, ఎదురుపడ్డం సంభవిస్తే, ముఖం భూమిలోకి దించేసుకుంటుంది.

అంతవర కెందుకు—సీతారత్నం పెళ్ళిచూపులికి, చూపులైపోయాక తాంబూలా లిచ్చుకున్నాక, సీతారత్నంతో అంది: "అబ్బా-ఛీ-పాడు, అలా ఆ అబ్బాయిముందు కూర్చోడానికి సిగ్గేయలేదటే నీకు...పైపెచ్చు నదురు బెదురు లేక ఆ అబ్బాయివంక తెగ చూసావ్, నేనైతేనా చస్తే-ఊహు" అని.

దానికి సీతారత్నం అప్పుడే నవ్వేసి .."మరి రేపొద్దుట నిన్ను చూచుకోడాని కెవరైనా వస్తే ఏం చేస్తావే?" అంది.

అయితే గువ్వలో వేరొక సుగుణం లేకపోలేదు. పురుషుల ముఖాల్లోకి చూడాలన్నా, తను కనపడాలన్నా ఎంత సిగ్గుపడుతుందో తను వాళ్ళకి కనపడని విధంగా ఉండి చూడ్డానికి అంతటి కుతూహలాన్నీ కనపరుస్తుంది.

ఆసలు సుబ్బులు భర్తతో వచ్చిన కొత్తతన్ని వస్తూండగానే వాళ్ళ తలుపుచాటునుంచి చూసింది. కాని పక్కవాటుగా ఉండిపోయిన అతని ముఖం పూర్తిగా కన్పించలేదు. చేతిన గడియారం, కాలికి బూటు, పొడుగు ఫాంటు, పొట్టి చేతులుగా మడచిన పొడుగుచేతుల చొక్కా, ఉంగరాల జుత్తు, కోటేరు ముక్కు, పక్కవాటుగా యివి మాత్రమే కన్పించాయి గువ్వకి.

తనకి కన్పించిన వివరాలనుబట్టి "ఎవరో మొత్తానికి బస్తీలో కాలేజీలో చదువుతూన్న రకమే అయివుండాలి" అనుకుంది. అలా ఊహించుకోడానికి కూడా కారణం లేకపోలేదు.

అర్నెల్లక్రితం జీలకర్రగూడెం కొండలమీదున్న బౌద్ధ గుహల్ని చూడ్డానికొచ్చిన కాలేజీ విద్యార్థులు, జీలకర్రగూడెం వీధుల్ని నిశితంగా పరిశీలిస్తూ ఊరంతా తిరుగుతూండగా తలుపుచాటునుంచి అందర్నీ చూచిన గువ్వ, కాలేజీ విద్యార్థులకి సంబంధించిన వేషభాషలకి ఓ నికరమైన రూపును అనాడే తన మనఃఫలకంమీద చిత్రించుకుంది.

ఆ చిత్రానికి సీతారత్నం మొగుడు వెంట వచ్చిన ఈ క్రొత్తబ్బాయి వేషభాషలకి ఒకసారి తైపారుచేసి చూచుకుని, తేడా లేదన్నది తెలుసుకున్న తర్వాతనే 'ఇతను కాలేజీలో చదివే బాపతయ్యుండాడు' అని నిశ్చయించుకుంది.

నిజం చెప్పాలొస్తే, అర్నెల్లక్రితం వాళ్ళని చూచినపుడు గువ్వగుండెల్లో (అదే-హృదయంలో) ఒక సరికొత్త కోర్కె మొలకెత్తిన మాట వాస్తవం. కార్య కారణ సిద్ధాంతదృష్ట్యా దీనికైసైతం మూలం లేకపోలేదు.

అంతకి మూణ్ణెల్లక్రితమే సీతారత్నం పెళ్ళి,

కావటంవల్ల సీతారత్నం మొగుణ్ణి చూసిన గువ్వ మనసులోనే పెదవి విరుచుకుంది.

హైస్కూలు చదువుతోనే చదువు చాలించి, మేడిపట్టిన సీతారత్నం కాబోయే మొగుడు, పెళ్ళి చూపులకొచ్చిననాడు, నేతపంచెకట్టి, గళ్ళచొక్కా వేసుకుని, బుజంమీద తుండేసుకున్నాడు. చేతికి గడియారంగాని, కాలికి కంపెనీ బూట్లుగాని లేవు. తర్వాత లగ్నం నిశ్చయమయినాక - పెళ్ళిపీటల మీదున్న అతన్ని చూచి—"ఏమీ బావుండడు" అనుకున్న గువ్వ, "అయ్యో! బావుంటే మటుకు తనకు ఒరిగేదేమిటి? సీతారత్నం మొగుడుగా" అనుకుని ఊరుకుంది.

అప్పట్నుంచే సీతారత్నం మొగుడులాంటివాళ్లు తనకి కాగూడదనుకున్న దాని ఫలితమే, దరిమిలాను మూణ్ణెల్లకొచ్చిన, ఆన్నెల్లక్రితం నాటి కాలేజీ విద్యార్థుల్ని చూచిననాడు కలిగిన కోర్కెకి మూలమయింది.

కాలేజీ విద్యార్థు లందరూ, కట్టగాకట్టుకుని, ఇంగ్లీషులో మాట్లాడుకుంటూ, చిరునవ్వులు నవ్వుకుంటూ, వాకిట తలుపులవంక వారగా చూచుకుంటూ (వాళ్ళకీ తెలుసును కాబోలు, తనలాంటి వాళ్ళు తలుపులవెనకనుంచి చూస్తారని) పోతూంటే తనలో తను అనుకుంది గువ్వ- 'వీళ్ళలో ఎవరైనా తన మొగుడైతే బావుండును'అని. మళ్లా వెంటనే- 'ఛీ, పాడు, తనలా అనుకున్నట్లెవరికైనా తెలిస్తే' అనుకుని, తనలోతనే సిగ్గుపడిపోయింది.

అప్పట్నుంచే సీతారత్నం వేళాకోళాని కెప్పుడైనా తన పెళ్ళిగురించి మాట్లాడితే, దానిదగ్గరున్న చదువును పురస్కరించుకుని. సిగ్గువిడిచి, పైకి అనేసేది కూడా—

"ఊహూ! నేను చదువుకున్నవాణ్ణి తప్పితే మరొకణ్ణి చేసుకోను"అని. అలా తను చదువుకున్నవాడినే చేసుకోవాలనుకోడానికి మరికొన్ని చిల్లర కారణాలుకూడా లేకపోలేదు.

ఊళ్ళోని ఆడపిల్లలందరిలో పట్టుఫారం వారకు బోర్డు స్కూల్లో చదివింది ఒక్క 'గువ్వే'. పైగా జార్జెట్ చీరలు కట్టి ఫేసుపౌడరు పూసుకుని వేసుకున్న రెండు జడల్లోనూ ఒకటి ముచ్చటగా ముందుకేసుకుని, సాజాగ్గా కన్పించేది ఒక్క గువ్వే—అందుకే గువ్వకి పేరుపడ్డది గూడెంలోని కన్నెపిల్లలలో గువ్వే అందగత్తె అని.

దీనిమీదే గువ్వ తండ్రి గున్నయ్య ఏనాడో పబ్లిగ్గానే శపథం చేశాడు: "ఎహెయ్ అట్టాటిట్టాదైతే మా గువ్వకి సేత్తానేంటి పదివేలు పోయినా దానంత అందగాడై బాగా చదువుకున్నోడిక్కైతేనే చేసేది" అని.

అందువల్లే గువ్వ తనక్కాబోయే కొత్త గూటినో పెద్ద మేడగాను మొగుణ్ణొక దొరగాను, ఏనాడో ఊహించుకుంది.

ఆట్టేది ప్రొద్దుట సీతారత్నం మొగుడు వెంట వచ్చిన కొత్తతన్ని ప్రక్కవాటుగానే చూచి చూపు కందిన వివరాల మేరకే 'దొర'లానే ఉన్నాడనుకున్నా, కుతూహలం ఆగక భోజనాల టైములో కూడా సీతారత్నం వాళ్ళింటికొచ్చి తలుపు సెరల్లోంచి, పరిశీలనగా చూచింది.

నిటారుగా ఎదరనుంచి చూస్తే మరీ చచ్చేటంత బావుందా కొత్తబ్బాయి ముఖం. ఎర్రగా అచ్చంగా దొరలాగానే ఉన్నాడు. మూరలో, ముప్పాతిక బారున, కోలగా ఉందా ముఖం. గెడ్డం చివర తన గడ్డంలాగానే కొనతేలి మధ్య చిన్న సొట్ట ఏర్పడి చూడ్డానికెంతో ముచ్చటగా ఉంది. పెద్ద గవ్వలాంటి కళ్ళు సూదంటు రాళ్ళల్లా లాగేసేస్సై. అతను అన్నంలోకి పెరుగు వలకబోసుకుంటూండగా సీతారత్నం మొగుడు వేళాకోళాని కేదో మాటంటే పక్కున నవ్వేశాడు. పెరుగుగిన్నె క్రిందపెట్టేసి మెత్తటుప్పు వేసుకుని, కలుపుకుంటూ ఆ నవ్వులో ఆ ముఖం మరికాస్త అందంగా కన్పించింది. చొక్కా ప్లేటుకున్న మూడు గుండీల్లోను అడుగుది మాత్రమే బిగించి, పైవి రెండూ వదిలేసి గుండెలకి దిగువారగా ప్లేటు ముచ్చటగా వెనక్కి విరిచేడు. కొట్టొచ్చినట్లు కన్పించిన ఆ కొత్తబ్బాయి ఎదురొమ్ము భాగాన్ని చూసేసరికి నిజంగానే తనవళ్ళు పులకరించింది. అప్పుడే ఉండబట్టలేక అలా సెరల్లోంచి చూస్తూనే చాటుగా గుండెల్లో అనుకుంది: "అబ్బా ఈ అబ్బాయి ఎంత బావున్నాడు చక్కగా, తన మొగుడైతే బావుండును" అని.

అక్కణ్ణుంచి ఇంటికొచ్చేసి సాయంత్రం అయ్యేవరకు...సీతారత్నం మొగుడు వెంటవచ్చిన

చాలా బాగున్న ఆ కొత్తబ్బాయిని గురించే ఆలోచించింది.

"ఛ-ఇదేమిటీ అతన్ని గురించి తనింతగా ఆలోచించడం" అనుకుని మనసు కట్టపరచుకోబోయినా తనకి తెలియకుండానే తన ఆలోచనలు మళ్ళీ సీతారత్నం మొగుడు వెంటవచ్చిన కొత్తబ్బాయిమీదికే పోయినై. ఇక లాభంలేదనుకుని గట్టిగా ఆలోచించుకుని చాటుగా నిర్ణయం చేసుకున్నాకనే ఆ సాయంకాలం తలదువ్వుకుంటున్న సీతారత్నాన్ని గోడమీద సున్నాన్ని గోళ్ళతో గీరుతూ అడిగేసింది. తీరా అడిగితే ఫక్కున నవ్వేసింది సీతారత్నం.

అలా సీతారత్నం నవ్వేశాక, గువ్వ సిగ్గుతో తలవంచేశాక సమాధానంగా సీతారత్నం అంది:

"ఏమే చదువుకున్న వాణ్ణి చేసుకుంటానని శపథం చేశావుగా...కొంపతీసి మనసుగాని-"

"ఊ పోవే- నువ్వు మరీను" కోపంగా అనేసి సిగ్గుతో మరికాస్త తలొంచుకుంది గువ్వ.

గువ్వ ఆంతర్యాన్ని గ్రహించిన సీతారత్నం గువ్వనేడిపించడానికి "ఏమేయ్ కొంపతీసి గాలిమేడలు కట్టావ్...కూలిపోగలవు- ఆ అబ్బాయికి పెళ్ళయిపోయిందట" అంది.

చివాల్ని ముఖం పైకెత్తింది గువ్వ. ఎర్రని గువ్వముఖం నల్లబడిపోయింది హఠాత్తుగా- కళ్ళు చెమ్మగిల్లాయ్. పెదవులు వణుకుతూంటే బిగబట్టుకో చూచింది.

గువ్వస్థితి చూచేసరికి సీతారత్నాని కంతలోనే జాలివేసింది. అసలు దానికున్న సిగ్గుకి మనసులో ఎంతో కోర్కగా ఉంటేనే కాని అలా అడిగుండదన్న విషయాన్ని గ్రహించిన సీతారత్నం- ఇక ఏడిపించటం భావ్యంకాదనుకుని—

"ఏమే పాపం ఏడుపొస్తోందా! కాలేదులే పెళ్ళి...విచారించకు- బి ఏ చదువుతున్నాట్ట... బేరం పదివేలలో ఉందట. ఆయన చెప్పారు... ఏమంటావ్ మరి. బాబాయికాపాటి స్తోమతుందిగా" అంది నవ్వుతూ గువ్వ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసి.

గువ్వముఖం ఒక్కసారిగా సంతోషంతో విప్పారింది. ఇకక్కడ నిలువలేక ఇంటికి తుర్రున పరిగెత్తుకు పోయింది.

ఆ మర్నాడు గువ్వ తండ్రి గున్నయ్య సీతారత్నం మొగుణ్ణి పల్కరించి భోజనానికి చెప్పే నెపంమీద సీతారత్నం వాళ్ళింటికెళ్ళి కొత్తతన్ని కూడా పల్కరించి ఇద్దరికీ ఆ పూటే భోజనానికి చెప్పేడు.

ఇద్దరూ వచ్చి భోజనం ముగించుకుని పోబోయే ముందు కొత్తతని వివరాలడిగి తెలుసుకున్న గున్నయ్య—

"హరి...మా వెంకటరత్నం బాబాయి-కోడల్లుడి మేనల్లుడివేన్న మాట" అన్నాడు ఆశ్చర్యపోతూ.

తర్వాత మరో నెలరోజులకే గువ్వకి సీతారత్నం మొగుడు వెంటవచ్చిన కొత్తబ్బాయితో పెళ్ళయిపోయింది.

ఎంత కావాలనుకుని సీతారత్నం మొగుడు వెంటవచ్చిన ఆ కొత్తబ్బాయినే చేసుకున్నా అంపకాలనాడు గువ్వ కొత్తగూటికి తరలి పోబోయే ముందు గువ్వనిచూచి కన్నీరు కార్చిన తల్లిదండ్రుల్ని చూచి గువ్వసైతం కన్నీరు కార్చక మానలేదు. ★

---

# చేయకు—

ఉదయాన్నేలేచి కలువ
వికాసాన్ని కోరకు
ఇసుక కుప్పవలె అలలకు
క్షణక్షణం మారకు

దొర్లే గోళాల గతిని
త్రిప్పు ముక్కుముక్కకు
పారలు ప్రక్కవాని కంటి
నీటి నాప స్రుక్కకు

ఆదర్శం ముందెన్నడు
అవసరాన్ని చూడకు
ప్రచారాల తెఱలుదుల్చి
ప్రతిభ చూడనోడకు

—భండారు పర్వతాలరావు.